AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ఉపాధి జాడేది?



2



2

వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం

అడవిలో గుట్టుగా పేకాట.. దాడిచేసి పట్టుకున్న పోలీసులు

అక్షరటుడే, బాన్సువాడ: మండలంలోని తాడ్కోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నారు. సీఐ తుల శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్కోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడులు చేశారు. వారి వద్ద నుంచి రూ.50,280 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం కేసు నమోదు చేశామన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, సింగిల్ విండో మాజీ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ గౌడ్ అన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందినప్పుడే వారి జీవితాల్లో నిజమైన మార్పు వస్తుందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పేద ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశాంత్ గౌడ్ కొనియాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే ఆశయం నెరవేరాలని, జన్ముల సుజాత, కొర్న పోచమ్మ కుటుంబాలు త్వరలోనే తమ సొంతింటిలో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పేదల సంక్షేమం, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రశాంత్ గౌడ్ పేర్కొన్నారు. లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.



మోకాళ్లపై కూర్చొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

అక్షరటుడే, కామారెడ్డి: జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టరేట్ ధర్నా చౌక వద్ద వినూత్న నిరసన చేపట్టారు. మోకాళ్ళపై కూర్చొని కళ్ళు మూసుకొని ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని పీఆర్టీయూ (తెలంగాణ) ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాజ్యాధికార పార్టీ సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపాయి. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మనోహర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణను ఎలాగైతే సాధించుకున్నామో అదే పంథాను కొనసాగించాలని తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమ్మెను నీరుగార్చే ప్రయత్నం అధికార పక్షాలు చేస్తాయని జాగ్రత్తతో ఉద్యమ పోరాటాన్ని విరమించకుండా ప్రధాన డిమాండ్లు సాధించేవరకు ఏకతాటిపై ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు తాహెర్ మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సైతం ఉద్యోగులు ఇబ్బందులు పడటం దౌర్భాగ్యకరమైన విషయమన్నారు. తీన్మార్ మల్లన్న ఉద్యోగుల పక్షాన అండగా నిలబడుతూ తెలంగాణ రాష్ట్ర మంతా పర్యటన చేసి జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుమన్, జేఏసీ నాయకులు అశ్విని, వెంకటరమణ, రాహుల్, మౌనిక, మీనాక్షి, రవళి, సందీప్, అఖిల్, క్రాంతి తదితరులున్నారు.

పెరిగిన విద్యుత్ డిమాండ్.. ట్రాన్స్‌కోకు సవాల్..!

ఉమ్మడి జిల్లాల్లో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. గృహ అవసరాలతోపాటు వ్యవసాయ బోర్లకు డిమాండ్ అధికమవు తుండటంతో పంపిణీ వ్యవస్థపై భారం పడుతోంది. వేసవిలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సరఫరా అందించేం దుకు విద్యుత్తు అధికారులు సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు, విద్యుత్తు లైన్ల విస్తరణపై దృష్టి సారించారు.
– అక్షరటుడే, భీమ్‌గల్



■ ఎల్‌నినో ఎఫెక్ట్‌తో పెరిగిన వినియోగం ■ సవాల్‌గా మారిన విద్యుత్ సరఫరా
■ ఇప్పటికే ఏర్పాట్లు చేసిన విద్యుత్ శాఖ అధికారులు
■ నిజామాబాద్ సర్కిల్‌లో రోజుకు 11.25 మిలియన్ యూనిట్ల వినియోగం

నిజామాబాద్ విద్యుత్తు సర్కిల్ పరిధిలో అక్టోబరు 1 నుంచి 12వ తేదీ వరకు రోజువారీ సగటు వినియోగం 11.25 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఇది 6.38 మిలియన్ యూనిట్లుగా ఉంది. సెప్టెంబరులో గరిష్ఠ డిమాండ్ 767 మెగావాట్లకు చేరింది. పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

నిజామాబాద్‌లో కొత్త సబ్‌స్టేషన్లు

జిల్లాలో 8.21 లక్షలకు పైగా విద్యుత్తు కనెక్షన్లు ఉండగా, వాటిలో సుమారు 5.33 లక్షలు గృహ, 1.88 లక్షలు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. నిజామాబాద్ సర్కిల్ పరిధిలోని 139 సబ్‌స్టేషన్లను స్కాడాతో అనుసంధానం చేశారు. 20 సబ్‌స్టేషన్ల అనుసంధాన పనులు పురోగతిలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పెరుగుతున్న లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ధర్పల్లి మండలం డీబీ తండా, కోటగిరి మండలం ఎత్తొండ ప్రాంతాల్లో పనులు చేపట్టారు. ఏదైనా ఒక లైన్ లేదా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ఇప్పటివరకు 126 సబ్‌స్టేషన్లను అనుసంధానించారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి జిల్లాలో సుమారు ఆరు లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉండగా, వాటిలో 4.78 లక్షలు గృహ, 1.10 లక్షలు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వేసవిలో రోజువారీ వినియోగం నాలుగు మిలియన్ యూనిట్ల నుంచి 5.3-7 మిలియన్ యూనిట్ల వరకు పెరిగే పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూరు, బిచ్కుంద మండలం గుండెనెమ్లి తదితర ప్రాంతాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టారు.

సోలార్ ప్లాంట్లు..

మౌలాలి తండా సమీపంలో పీఎం కుసుమ్ఏ పథకం కింద 1.6 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను 33/11 కేవీ తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌కు అనుసంధానించి విజయవంతంగా ఛార్జింగ్ చేశారు. పీఎంకుసుమ్ పథకం ద్వారా రైతులు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారి స్థిరమైన అదనపు ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

సవాల్‌గా తీసుకుంటున్నాం

జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగింది.ఎల్‌నినో ఎఫెక్ట్ కారణంగా వర్షాల్లేవు. ఈ సమయంలో విద్యుత్ డిమాండ్ పెరిగినందున ముందుగానే ట్రాన్స్‌కో సిద్ధమైంది. ఒక సబ్‌స్టేషన్‌లో సమస్య ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా కరెంట్ సరఫరా కోసం ఇప్పటివరకు 126 సబ్‌స్టేషన్లను అనుసంధానించాం. లోడ్‌కు అనుగుణంగా ప్రతి సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. – పీవీ రాజేశ్వర్‌రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ

కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలి


అక్షరటుడే, కామారెడ్డి: మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ప్రభుత్వం ద్వారా రాయితీ పొందిన భిక్కనూర్ మండలం గుర్జకుంట రైతులు ఆదివారం షబ్బీర్ అలీని కలిశారు. పంట మార్పిడి చేపట్టి కూరగాయల సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ప్రత్యేక రాయితీలు అందిస్తోందన్నారు. కూరగాయల సాగుకు ఎకరాకు రూ.9,600, మల్చింగ్ విధానం కోసం ఎకరాకు రూ.8,000 చొప్పున మొత్తం ఎకరాకు రూ.17,600 వరకు రాయితీ అందించనున్నట్లు తెలిపారు. గుర్జకుంట గ్రామానికి చెందిన 58 మంది రైతులకు ఈ పథకం కింద సుమారు రూ.4 లక్షల మేర రాయితీలు మంజూరయ్యాయన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. మల్చింగ్ విధానం వల్ల నేలలో తేమను కాపాడుకోవడం, కలుపు మొక్కల నియంత్రణ, నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించడం వంటి ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. రైతులు ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు.



పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి



అక్షరటుడే, కామారెడ్డి: పోలీసు శాఖలో పదోన్నతులు సిబ్బంది వృత్తిపరమైన ఎదుగుదలకు ప్రతీకలని, అదే సమయంలో వారి బాధ్యతలను మరింత పెంచుతాయని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఏడుగురు పోలీసులు ఆదివారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పదోన్నతి పొందిన వారిలో పీసీఆర్ కంట్రోల్ రూమ్ లో పని చేస్తున్న బి. రమేష్, రామారెడ్డి పోలీస్ స్టేషన్ సిబ్బంది సదయ్య, బిచ్కుంద పి. రాధాకృష్ణ, బీర్కూర్ టి. వీరబాబు, బాన్సువాడ సాయిల, లింగంపేట పోలీస్ స్టేషన్ కు చెందిన ఆర్. బన్సీలాల్, కె. రమేష్ ఉన్నారు. వీరిని ఎస్పీ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి పొందిన సిబ్బంది కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని, విధి నిర్వహణలో ఆదర్శంగా నిలవాలని పదోన్నతి పొందిన సిబ్బందికి సూచించారు.



ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని వర్ని చౌరస్తాలో ఉన్న ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడిగా అడ్డగుల భాస్కర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా రాంపల్లి రవీందర్, గౌరవ అధ్యక్షుడిగా అల్లాడి రవి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గానికి నిజామాబాద్ ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, కోశాధికారి సీతారాం, ఐటీఐ హెల్త్ అండ్ వెల్త్ ప్రిన్సిపల్ గంగాదాస్, పీఈ టీవీ ప్రభాకర్, సైకిల్ శ్రీను శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి డీసీపీ(అడ్మిన్) శుభం ప్రకాశ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ ఫ్లాగ్‌డేను పురస్కరించుకుని బైక్ ర్యాలీని డీసీపీ(అడ్మిన్) శుభం ప్రకాశ్ ప్రారంభించారు. పూలాంగ్ చౌరస్తా నుండి ప్రారంభమై ఈ ర్యాలీ ప్రగతి హాస్పిటల్, ఎల్‌ఐసీ చౌరస్తా, కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు సాగింది. అదనపు పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎందరో పోలీస్ సిబ్బంది నక్సలైట్లు, మతపరమైన విభజన శక్తులు, ఇతర సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ విధి నిర్వహణలో వీర మరణం పొందారన్నారు. మాదక ద్రవ్యాలను రవాణాను నిలువరించేందుకు.. మహిళ భద్రతకు, తమ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. వీరి త్యాగాల వల్లే ఈరోజు దేశం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల భాగంగా పోలీసు కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు.

ఉత్సాహంగా పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 26 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న పాతస్నేహితులు మళ్లీ కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న రోజుల్లోని అనుభవాలు, ఆటపాటలు, ఉపాధ్యాయులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేస్తూ అప్పటి స్నేహబంధాలను మరోసారి పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. పదో తరగతి అనంతరం వివిధ మార్గాల్లో ముందుకు సాగిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ఉద్యోగ, వ్యాపార రంగాలతో పాటు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.



'మన్ కీ బాత్' సామాన్యుల విజయగాథలకు జాతీయ వేదిక



అక్షరటుడే, ఇందూరు: సామాన్యుల విజయగాథలకు జాతీయవేదికగా 'మన్ కీ బాత్' నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌ను ఆయన వీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు కృషి, సేవా స్ఫూర్తి, ఆవిష్కరణలు, దేశీయ ప్రతిభను దేశవ్యాప్తంగా పరిచయం చేయడం కార్యక్రమ ప్రత్యేకత అని తెలిపారు. 12ఏళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న మన్ కీ బాత్ ప్రజలకు, ప్రధానమంత్రికి మధ్య ఒక ఆత్మీయ వారధిగా నిలిచిందన్నారు. ఈ ఎపిసోడ్‌లో పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో సహజ పత్తి సాగును ప్రోత్సహిస్తున్న 'సవ్‌త్రింజన్' కార్యక్రమాన్ని ప్రధాని ప్రశంసించడం విశేషమని పేర్కొన్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడంతో పాటు, చేనేత నైపుణ్యాలను భావితరాలకు అందించడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని వివరించారు.

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
ఆదివారం
25.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

సేవా దృక్పథంతో మెలగాలి : ధన్‌పాల్



అక్షరటుడే, ఇందూరు: ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. శ్రీ ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిసాన్ ఫ్యాషన్ మాల్‌లో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్, ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ప్రతిఒక్కరూ తమ సంపాదనలో కొంతమేర సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నారు. పేదలను ఆదుకొని అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యువత వారాంతంలో హంగు ఆర్భాటాలకు పోకుండా తోచిన విధంగా సేవ చేయాలని సూచించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో పేరు ప్రతిష్టలతో పాటు నలుగురికి సాయం చేశామన్న తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ధన్‌పాల్ ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆలూర్‌లో ఘనంగా గోమాత కల్యాణోత్సవం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలో మల్లన్న దేవాయలంలో గోమాత కల్యాణోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీడీసీ మాజీ అధ్యక్షుడు బార్ల గణపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయంలో గోమాతకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. గోవును పూజించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గోమాతను పూజించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమన్నారు. గోవులను సంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర విజయ్, వీడీసీ అధ్యక్షుడు కళ్లెం మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అరుణ్, దుమ్మాజి శ్రీనివాస్, ఇందూర్ గోసేవ సామతి సభ్యులు, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి జాడేది?

- గాంధారి మండలంలో నామమాత్రంగా ఉపాధి పనులు
- కొన్ని గ్రామాల్లో ఇంకా ప్రారంభం కానివైనం
- అమలులో సర్పంచ్‌ల పాత్రే కీలకం

గాంధారి మండల పరిధిలోని 45 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు అరకొరగానే సాగుతున్నాయి. ఇప్పటివరకు దాదాపు 30 పంచాయతీల్లో పనులు ప్రారంభమైనప్పటికీ, మిగతా గ్రామాల్లో పనులు మొదలుకావాల్సి ఉంది. దీంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.
– అక్షరటుడే, గాంధారి

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించి, వలసలను అరికట్టాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ పథకం పలు గ్రామాల్లో నామమాత్రంగానే కొనసాగుతోంది. పనులు మొదలైన చోట్ల కూలీల హాజరు తక్కువగా ఉండగా, అసలు పనులు ప్రారంభం కాని గ్రామాల్లో కూలీలు ఉపాధి కోసం ఎదురుచూస్తూ నిరాశకు గురవుతున్నారు.

జీపీల విలీనం.. వివక్ష ఆరోపణలు

గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ అమలుపై సర్పంచ్‌ల పాత్ర కీలకంగా మారింది. అయితే, గతంలో రెండు గ్రామాలను కలిపి ఒకే గ్రామ పంచాయతీగా మార్చిన ప్రాంతాల్లో సర్పంచ్ గెలిచిన గ్రామానికే ప్రాధాన్యం ఇస్తూ, రెండో గ్రామంపై వివక్ష చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలోని కూలీలందరినీ ప్రోత్సహించి, అవసరమైన పనులను గుర్తించి అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పథకం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గాలు దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూలీల సంఖ్య పెరిగేలా చూస్తాం

ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. అర్హులైన కూలీలందరికీ ఉపాధి లభించేలా పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది.
– మధు, ఉపాధి హామీ అధికారి

26 నుంచి మెండోరాలో అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు

అక్షరటుడే, బాల్కొండ(పోచంపాడ్): మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు (ఖోఖో, వాలీబాల్) 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని క్రీడల నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీలను మండలంలోని పోచంపాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో అక్టోబర్ 26, 27, 28 తేదీలలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పీడీ పెగడ నరేందర్, ప్రధానోపాధ్యాయులు అదాని ధర్మపురి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి హాజరు కానున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, శారీరక దృఢత్వాన్ని అభివృద్ధి చేయడం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందించడం కోసం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలను మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

బస్సాపూర్ క్రాసింగ్ వద్ద వాహన తనిఖీలు



అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్సాపూర్ క్రాసింగ్ వద్ద పాత జాతీయ రహదారిపై పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఏఎస్సై చిన్నయ్య ఆధ్వర్యంలో అన్ని రకాల వాహనాలను ఆపి సంబంధిత పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులతో పాటు హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



అక్షరటుడే, కోటగిరి : ఎల్‌నినో ప్రభావం వల్ల తాగునీటి వనరుల్లో నీళ్లు తగ్గిపోతున్నాయని.. కాబట్టి ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మాండ్లు అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని ఆదివారం పలు కాలనీలో తిరుగుతూ నీరు వృథాగా పోకుండా నల్లాలకు ట్యాప్‌లను పెట్టించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం, నీటిని పంచాయతీ సిబ్బంది విడుదల చేయగానే సరిపోయినంత వాడుకొని వృథాగా పోకుండా నల్లాలను బంద్ చేయాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం వల్ల అధిక ఉష్ణోగ్రత పెరిగి, భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నబీ, వార్డు మెంబర్లు సాయిలు, అనిల్, పోశెట్టి కాలనీవాసులు, పంచాయతీ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



అక్షరటుడే,ముప్కాల్: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో హైదరాబాద్ కొంపల్లి కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ చైతన్య కిషోర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, థైరాయిడ్, బీఎండీ, కీళ్ల నొప్పులు తదితర పరీక్షలు చేశారు. 150మందికి వివిధ రకాలైన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది సాయికుమార్, చంద్రశేఖర్, గిరిధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించడానికి గ్రామాల్లో ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ చైతన్య కిషోర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రానికి చెందిన గుండ్ల మెట్‌పల్లి ఒడ్డెన్న కుటుంబానికి దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూ.10,600 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలపడం, కష్టసమయంలో తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర విజయ్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, మాజీ సొసైటీ ఛైర్మన్ భోజారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, డాక్టర్ అరుణ్, మహేందర్, శ్రీనివాస్, సత్యం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కాలం మారినా, దారులు వేరైనా స్నేహబంధానికి హద్దులుండవని పూర్వవిద్యార్థులు నిరూపించారు. నగరంలోని శ్రీ విద్యా పబ్లిక్ స్కూల్ 1996-97 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు 29ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిశారు. నగరంలోని గంగాస్థాన్ బైపాస్ సమీపంలో డాక్టర్స్ కాలనీ సుహాన్సి రాయల్ బంకెట్ హాల్ వేదికగా ఈ రీ యూనియన్ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తమ గురువులు స్కూల్ కరస్పాండెంట్ రవి, ఉపాధ్యాయులు మల్లికార్జున్, జగదీశ్వర్, సాయన్న, నాగరాజు, మృత్యుంజయ, నారాయణ, చంద్రకళ, రాజేశ్వర్, భూమేశ్వర్, అటెండర్ అశోక్‌లను ఘనంగా సన్మానించారు. తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల ఆశీస్సులు పొందడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమతో పాటు చదువుకుని అకాల మరణం చెందిన సహచర మిత్రులు మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి సురేష్, స్వప్న, సాయి కుమార్, వరలక్ష్మి , సుజాత జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆనాటి అల్లరి.. కష్టసుఖాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా మళ్లీ ఒక్కటైన మిత్రులు, ముఖాలు మారినా మనసుల్లోని స్నేహబంధం మాత్రం చెరిగిపోలేదని చాటిచెప్పారు.





అనంత ఆంజనేయ స్వామి ఆలయంలో స్వచ్ఛభారత్

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో మామిడిపల్లి అనంత ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆలయం ఆవరణలో చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించారు. 9వ వార్డు కౌన్సిలర్ పోచంపాడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన కాలనీలో ఉన్న ఆలయం ఆవరణలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించడం ఎంతో సంతోషకర విషయం అన్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. తమ ఆలయంలో ఇలాంటి స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 77వ ఆదివారం మామిడి పల్లి లో అనంత ఆంజనేయ స్వామి ఆలయంలో శుభ్రం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, రమేష్, రాజ్ కుమార్, సుంకే నిశాంత్, యాదగిరి,ఆదిత్య, గుర్రం రాకేష్, డ్రైవింగ్ వేణు, సుమన్, కృషవర్ధన్, రాజన్న, జంగిడి భోజన్న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో.. వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం

అక్షరటుడే, గాంధారి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన గాంధారి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన అంజయ్య కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. స్కూల్ బస్సు నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ మధ్య తరచు భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో భార్య గాంధారి పోలీస్‌స్టేషన్‌కు అతడిని తీసుకొచ్చింది. పోలీసులు కుటుంబసభ్యులు ముందుగా మాట్లాడుకోవాలని చెప్పగా ఇంతలోనే అంజయ్య కామారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య యత్నం చేశాడు. దీంతో స్పందించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. కానీ అందుబాటులో లేక ప్రైవేట్ అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

